క్లుప్తంగా

వైఎస్సార్ జలకళ పథకం కింద బోరు ఏర్పాటు



మొవ్వలో పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

మొవ్వ: వైఎస్సార్ జలకళ పథకం కింద మొవ్వ గ్రామంలో ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ సభ్యులు రాజలపాటి పార్వతి బోరు ఏర్పాటుకు భూమి పూజ చేశారు. గ్రామానికి చెందిన రైతు మండవ శ్రీరామ కృష్ణ చెందిన పొలంలో ఆధునిక పద్ధతి ద్వారా బోరును తవ్వించారు. రూ.2 లక్షల వ్యయంతో 240 అడుగులు తవ్వి బోరు వేశారన్నారు. ప్రభుత్వ పథకాలను అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు తెలిపారు.

సత్యదేవుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం



గుడ్లవల్లేరు: రెండో అన్నవరంగా ప్రసిద్ధి గాంచిన గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారి బ్రహ్మోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. వేద మంత్రోచ్ఛరణ నడుమ పండితులు స్వామివారిని పెండ్లి కుమారుని తయారుచేశారు. తొలుత స్వామి వారికి విశేషాభిషేకాలను నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో హోమాలను వేద పండితులు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుడివాడ సత్యనారాయణ గుప్తా, ధర్మకర్తలు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన



జమిదింటకుర్రు(పెదపారుపూడి): మండలంలోని జమిదింటకుర్రు పంచాయతీ కార్యాలయంలో పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధిపై మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ పుణుకొల్లు శివరామప్రసాద్ మాట్లాడుతూ.. కుష్ఠు వ్యాధి పట్ల వైద్యుల సూచనలు పాటించాలన్నారు. కుష్ఠు వ్యాధికి పీహెచ్‌సీలో మందులు అందుబాటు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

గుడివాడటౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్డులో వేం చేసి ఉన్న శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవస్థానం(పెద్ద శివాలయం)లో చేపట్టిన నిర్మాణం పనులు వేగవంతం చేయాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ తెలిపారు. ఆలయంలో చేపట్టవలసిన నిర్మాణ పనులపై ఆయన మంగళవారం సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ..రూ.కోటి 80 లక్షలతో పలు అభివృద్ధి పనులను బుధవారం నుంచి పనులు ప్రారంభిస్తామన్నారు. వాటికి కావలసిన అన్ని ఏర్పాట్లను పరిశీలించామని చెప్పారు. నిర్మాణ కమిటీ పర్యవేక్షణలో వేగవంతంగా పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం, నిర్మాణ కమిటీ చైర్మన్ చందరాల హరిరాం బాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందుల్లేకుండా చర్యలు



పామర్రు: ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు విధమైన చర్యలు తీసుకోవాలని పామర్రు తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో మండలంలోని 17 సచివాలయ పరిధిలో పీఏసీఎస్ సీఈఓలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రైతులు ధాన్యం నమూనాలను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి తేమ శాతం చూసుకోవాలన్నారు. ధాన్యం విక్రయాలకు ఆమోదం తెలిపితే అన్ని పనులు అధికారులే నిర్వహిస్తారని చెప్పారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తోలిన 21 రోజుల్లో రైతులకు ధాన్యం నగదు జమ అవుతుందన్నారు. రైతులు మిల్లర్ల వద్దకు వెళ్లనవసరం లేదన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓలు రవి, శేషురెడ్డి పాల్గొన్నారు.

గడప గడపలో ఆనందోత్సాహాలు

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



రొయ్యూరులో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, ప్రజాప్రతినిధులు

తోట్లవల్లూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో గడప గడపలో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయని ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని రొయ్యూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం జరిగింది. గ్రామంలోని కొత్త ఎస్సీ కాలనీ, తోడేళ్లదిబ్బలంకలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఇంటింటికీ వెళ్లి గడిచిన మూడున్నరేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించటంతో పాటు బ్రోచర్లను పంపిణీ చేశారు. గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకోవటంతో పాటు వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన..

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ తెలిపారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు దూసుకుపోతున్నారన్నారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావటంతో పాటు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని చెప్పారు. అమ్మ ఒడి, జగనన్న గోరు ముద్ద, మధ్యాహ్న భోజనం, జగనన్న విద్యాకానుక, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరగనుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అర్హత ఉండి పథకాలు పొందని వారు సచివాలయాల్లో తిరిగి దరఖాస్తు చేసుకుంటే పథకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, సర్పంచ్ నిమ్మగడ్డ ప్రభుదాస్, ఎంపీటీసీ దారం రోజారాణి, మాజీ ఎంపీపీ కళ్లం వెంకటేశ్వరరెడ్డి, నాయకులు నడకుదురు రాజేంద్ర, లుక్కా భరత్‌గౌడ్, లుక్కా విజయ్, చప్పిడి రాము, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు బొడ్డపాడులో..

తోట్లవల్లూరు: బొడ్డపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొనాలని జెడ్పీటీసీ విజ్ఞప్తి చేశారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు

ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పథకాలు పొందాలంటే అర్హతే ప్రామాణికమని, పార్టీలు, కులాలు, మతాలు, వర్గాలకు చోటు లేదని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. సర్పంచ్ మసిముక్కు మారుతీ ప్రసన్న, ఎంపీటీసీ సభ్యులు నీలి సుమన్, మహమ్మద్ సఫాయితుల్లాల ఆధ్వర్యంలో కలిదిండిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మూడున్నరేళ్లలో ప్రజలకు ప్రభుత్వం పొందిన లబ్ధిని వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే అందజేశారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధిని చూసి ప్రజలు ఆదరించాలని కోరారు. గత ప్రభుత్వంలో ఎవరికైన ధ్రువీకరణ పత్రాలు అవసరమైతే మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు గ్రామ సచివాలయాల్లోనే అన్ని సేవలు ప్రజల ముంగిటకే అందిస్తున్నామని చెప్పారు. గత పాలనలో జన్మభూమి కమిటీల సిఫార్సులతోనే పథకాలు దక్కేవన్నారు.

ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేరుగా అర్హుల బ్యాంకు ఖాతాలకు నగదును జమ చేస్తున్నారని తెలిపారు. తద్వారా దళారుల వ్యవస్థకు చెక్ పడిందన్నారు. పథకాలు దక్కని అర్హులు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కట్టా నాగలక్ష్మి, మండల సర్పంచుల సంఘ అధ్యక్షుడు గద్దె ఆనంద్‌కుమార్, మండల కోఆప్షన్ సభ్యుడు హాఫీజ్, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షేక్ చాన్ బాషా, పార్టీ నాయకులు కందుల వెంకటేశ్వరరావు, నీలపాల భోగేశ్వరరావు, గొరిపర్తి సుబ్బారావు, చిట్టూరి బుజ్జి, సోమరాజు, నీలపాల వెంకటేశ్వరరావు, విష్ణువర్ధన్, కాలవ నల్లయ్య, ఏసుబాబు, నున్న కృష్ణబాబు, సానా రాము, ద్రోణాద్రి సత్యనారాయణ, తిరుమలశెట్టి రాంబాబు, కుంభ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కలిదిండిలో ప్రభుత్వ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

గ్రామ సమస్యల పరిష్కారమే లక్ష్యం

గ్రామదర్శిని కార్యక్రమంలో అధికారులు

జురుగువరం(పామర్రు): గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా చీఫ్ ప్లానింగ్ అధికారి శ్రీలత అన్నారు. గుడివాడ, పామర్రు, కైకలూరు నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం అధికారులు గ్రామదర్శిని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయం, వీఆర్వో కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశు వైద్యశాలలను అధికారులు పరిశీలించారు. మండల పరిధిలోని జురుగువరం గ్రామాన్ని శ్రీలత సందర్శించారు. గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించి అర్హులైన వారందరికి ఇళ్ల స్థలాలను అందించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కనుమూరు గ్రామంలో ఆ గ్రామ ప్రత్యేక అధికారి హాజీ బేగ్ పర్యటించారు. ప్రజలకు సరఫరా అవుతున్న తాగునీటి నాణ్యతను పరిశీలించడంతో పాటు వివిధ కార్యాలయాలను పరిశీలించారు. పీహెచ్‌సీలో వైద్య సేవలపై ఆరా తీశారు. గ్రామ కార్యదర్శి సోమేశ్వరరావు, సహాయ కార్యదర్శి శిరీష, వీఆర్వో నాగభూషణం, సచివాలయ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు. ఉరుటూరు గ్రామంలో గ్రామాభివృద్ధిపై సమీక్షా సమాశం నిర్వహించామని గ్రామ ప్రత్యేక అధికారి సువర్ణ తెలిపారు. గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ అధికారి వి.భానుశ్రీతో కలిసి పర్యటించారు. గ్రామస్తుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ ఎం శ్రీనవత, కార్యదర్శి సోమేశ్వరరావు పాల్గొన్నారు. కొమరవోలు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో జరుగుతున్న విద్యాబోధనపై ఆరా తీశామని గ్రామ ప్రత్యేక అధికారి పద్మ తెలిపారు. గ్రామాన్ని సందర్శించామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



జురుగువరంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా చీఫ్ ప్లానింగ్ అధికారి శ్రీలత



వల్లూరుపాలెంలో వైద్యసేవలపై ఆరా తీస్తున్న సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఫణికుమార్

మెరుగైన సేవలు అందించాలి

తోట్లవల్లూరు: ఆరోగ్య ఉపకేంద్రాల ద్వారా మెరుగైన సేవలు అందించాలని సాంఘిక సంక్షేమశాఖ డెప్యూటీ డైరెక్టర్ సరస్వతి ఆదేశించారు. మండలంలోని వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, పెనమకూరు గ్రామాల్లో గ్రామదర్శిని కార్యక్రమాన్ని నిర్వహించారు. వల్లూరుపాలెంలో సోషల్‌వెల్ఫేర్ డీడీ సరస్వతి, తోట్లవల్లూరులో మార్కెటింగ్ ఏడీ నిత్యానందం, పెనమకూరులో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు పర్యటించారు. ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, ఈఓపీఆర్‌డీ రవికాంత్, కార్యదర్శులు వెంకటరత్నం, పుష్పనాథం, పిచ్చియ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల పరిశీలన..

కూచిపూడి(మొవ్వ): గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా మండలంలోని నాలుగు గ్రామాల్లో ప్రత్యేక అధికారులు ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించారు. గుడివాడ డీఎల్‌పీఓ జి.సంపత్‌కుమార్ కూచిపూడి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మధ్యాహ్న భోజనాన్ని, అభివృద్ధి పనులను పరిశీలించారు. కాజలో గుడివాడ ఈఐఈఓ పి.వినయ్‌కుమార్, చిన ముత్తేవిలో ఫిషరీస్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వెంకటేశ్వరరెడ్డి, మొవ్వలో ఏపీఐఐసీ అధికారి డి.శ్రీనివాసరావులు ప్రత్యేక అధికారులు వ్యవహరించి పలు విభాగాలను, శాఖలను పరిశీలించారు.

గుడ్లవల్లేరు: మండలంలోని చంద్రాల, పురిటిపాడు, మామిడికోళ్లలో శేరీ కల్చర్ డెప్యూటీ డైరెక్టర్ ఎస్.సత్యనారాయణ గ్రామదర్శిని కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయనతో పాటు జిల్లా నీటి వనరుల అధికారి కె.శ్రీనివాసరావు, డెప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ యు.వి.సుబ్బారావు గ్రామాల్లో పర్యటించారు. ఎంపీడీఓ డి.శ్రీనివాస్, తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ మస్తాన్, ఈఓపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, పంచాయితీ సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గుడివాడరూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామదర్శిని కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని జిల్లా కో ఆపరేటివ్ అధికారి వివివి ఫణికుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వలివర్తిపాడు గ్రామంలో గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అధికారులకు అభివృద్ధిపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ శాయిన నాగబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.అరుణకుమారి, పంచాయతీ కార్యదర్శి కె.అనూల, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి



ప్రజలతో మాట్లాడుతున్న ఆర్డీఓ పద్మావతి

గుడివాడటౌన్(నందివాడ): గ్రామాల్లో ప్రజల ఆరోగ్యం, మౌలిక వసతులపై ప్రజాప్రతినిధులు శ్రద్ధ చూపాలని ఆర్డీఓ పి.పద్మావతి సూచించారు. గ్రామదర్శినిలో భాగంగా మంగళవారం ఆమె నందివాడ మండలం వెంకట రాఘవాపురం గ్రామంలో పర్యటించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలల్లో నీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, సురక్షిత మంచినీటి వసతుల పనితీరు పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో రోగులతో చర్చించి వైద్యసేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రానున్న వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. గ్రామస్తులు శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరగా అందుకు సంబంధించి ఇప్పటికే తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. సర్పంచ్ కాకరాల సుభాష్‌చంద్రబోస్, ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్, డీటీ మల్లిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, వెలుగు ఏపీఎం సీహెచ్ ప్రధానరావు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న శివశంకర్

ముదినేపల్లిరూరల్: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవరచుకుంటే భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చని ప్రముఖ మేథోనైపుణ్యకుడు శివశంకర్ అన్నారు. ముదినేపల్లి మండలం వడాలి జెడ్పీహైస్కూల్ 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం ఏర్పాటుచేసిన నైపుణ్య తరగతుల్లో ఆయన మాట్లాడారు. పాఠ్యాంశాలతో పాటు సామాజిక అంశాలపైనా అవగాహన పెంచుకుంటూ ప్రతి అంశంపైనా నిర్భయంగా, నిశ్శంకోచంగా మాట్లాడగలిగే నైపుణ్యాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. పబ్లిక్ పరీక్షలను సాధారణ పరీక్షల వలే చూడడం వల్ల భయం వీడడంతో పాటు ఉన్నత ఫలితాలు సాధించవచ్చన్నారు. శివశంకర్‌ను, ఉత్తమ ప్రతిభ చూపిన పదో తరగతి విద్యార్థి సందీప్‌ను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ నాగమల్లేశ్వరరావు సత్కరించారు.

కోదండ రామస్వామి సేవలో ఎమ్మెల్యే డీఎన్నార్



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎంపీపీ రాము తదితరులు

మండవల్లి: కోదండ రామస్వామి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) తెలిపారు. మండవల్లి మండలం సింగనపూడిలో 73వ వార్షిక కల్యాణోత్సవాల్లో మంగళవారం ఎమ్మెల్యే పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్ (రాము), సర్పంచ్ కాగిత సూర్యనారాయణ, కోదండ రామస్వామి నిలయపీఠం ట్రస్ట్ అధ్యక్షుడు పి.సుబ్బరాయశర్మ, కార్యదర్శి పి.కోదండ రామశర్మ, కోశాధికారి ఎం.వెంకటనాగిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

మురుగు తొలగింపునకు చర్యలు



సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ

గుడివాడటౌన్: పట్టణంలోని ప్రధాన డ్రెయిన్లలో చెత్త, మురుగు తొలగింపునకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ ఆదేశించారు. స్థానిక 4, 7, 9 వార్డుల్లో ఆయన మంగళవారం శానిటేషన్ సిబ్బందితో కలిసి పర్యటించారు. అనుమతిలేని అడ్డంకులను తొలగించాలని సూచించారు. కొన్ని తోపుడుబండ్లు ఏర్పాటు వలన ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని వెంటనే సంబంధిత వార్డు ప్లానింగ్ సెక్రటరీలు వాటిని తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. 9వ వార్డులో మ్యాన్‌హోల్ పరిశీలించి అక్కడ ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో ప్లానింగ్ సెక్రటరీలు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్యశిబిరం

ఘంటసాల(అవనిగడ్డ): పెంపుడు జంతువుల నుంచి వచ్చే జూనోసిస్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గన్నవరం ఎన్‌టీఆర్ వెటర్నరీ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.జైబాల్ అన్నారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో మంగళవారం పెంపుడు జంతువుల వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన సదస్సు, ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. 40 పెంపుడు కుక్కలకు యాంటీ రాబిస్, 200 జీవాలకు నట్టల నివారణ మందు వేశారు. లివర్ టానిక్‌ని ఉచితంగా అందజేశారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత, పశువైద్యాధికారి కె.అభిలాష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్‌సీసీ - ఏ సర్టిఫికెట్ పరీక్ష



పామర్రు(పమిడిముక్కల): తాడంకి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ పరీక్షలను నిర్వహించామని హైస్కూల్ హెచ్‌ఎం ఎం.శారదా కాంత తెలిపారు. పాఠశాలలో పరీక్షలకు హాజరైన విద్యార్థులను మంగళవారం ఆమె అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. పాఠశాలకు చెందిన 28 మంది విద్యార్థులకు రాత పరీక్ష, స్కిల్ టెస్టులు నిర్వహించామన్నారు. మే, జూన్ నెలలో ఫలితాలు వెలువడతాయని తదుపరి వారికి సర్టిఫికెట్‌లు అందజేస్తామని తెలిపారు. 16వ ఆంధ్ర బెటాలియన్ నుంచి హవల్దార్ నీలం, ఎన్‌సీసీ ఆఫీసర్ ఏపీ రాజు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కంబపు రాంబాబు, సీనియర్ ఉపాధ్యాయులు సీహెచ్ రవికుమార్, బి.ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న జెడ్పీటీసీ వెంకట రమణకుమారి తదితరులు

పామర్రు(పమిడిముక్కల): రాష్ట్ర స్థాయి పోటీలకు తాడంకి హైస్కూల్ విద్యార్థులు అర్హత సాధించడం ఎంతో అభినందనీయమని జెడ్పీటీసీ ఏనుగ వెంకట రమణకుమారి అన్నారు. పమిడిముక్కల మండలం తాడంకి గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులను మంగళవారం అభినందించారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారు నిర్వహించిన వివిధ క్రీడా విభాగాల్లో అండర్-14, 17 విభాగాల్లో తాడంకి హైస్కూల్ విద్యార్థులు నలుగురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన అండర్-14 విభాగం యోగాలో కె.గణేష్, కె.వెంకట్ సాయి వరుణ్‌లు పాల్గొని విజేతలుగా నిలిచారన్నారు. గ్రామ సర్పంచ్ జంపాన ధనలక్ష్మి మాట్లాడుతూ.. విజయనగరం జిల్లా అలుగోలు జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన అండర్-17 కబడ్డీ బాలుర విభాగంలో ఈడే భరత్‌బాబు రాష్ట్ర స్థాయికి అర్హత సాధించాడన్నారు. చిత్తూరు జిల్లాలో నిర్వహించిన అండర్-14 కబడ్డీ విభాగంలో 8వ తరగతి బాకీ మాధవి పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకుకి ఎంపికైందన్నారు. విజేతలను, కోచ్ ఏపీ రాజులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, ముఖ్య అతిథులు అభినందించి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శారదా కాంత, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కంబపు రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీష్మ ఏకాదశి మహోత్సవాలు ప్రారంభం

గుడివాడటౌన్: స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లో వేం చేసి ఉన్న శ్రీ రమాసహిత వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో భీష్మ ఏకాదశి మహోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు స్వామి వారికి విశేష అభిషేకాలు గావించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య 108 కళశాలతో పంచామృతాలు, 9 రకాల పండ్లరసాలతో స్నపన అభిషేకం నిర్వహించారు. మూడు విడతలుగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తామని వల్లూరి రామకృష్ణమాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గుడే లక్ష్మీ రంగనాయకమ్మ, మాజీ కౌన్సిలర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పండ్ల వర్తకుల సంఘ భవనానికి స్థలం కేటాయించాలని వినతి



ఎమ్మెల్యే కొడాలి నానికి వినతిపత్రం అందజేస్తున్న పండ్ల వర్తకులు

గుడివాడటౌన్: పట్టణంలో భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని పట్టణ పండ్ల వర్తక సంఘ నాయకులు ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)కి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఆయనకు వినతి పత్రం అందజేశారు. పండ్ల వర్తక సంఘం గుడివాడ అధ్యక్షుడు గోకరకొండ బలరామ్ మాట్లాడుతూ.. వర్తక సంఘం వద్ద భవన నిర్మాణానికి కావలసిన నిధులు ఉన్నాయని, స్థలం కేటాయిస్తే భవనాన్ని నిర్మించుకుంటామన్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే కొడాలి నాని ఆర్డీఓ పి.పద్మావతితో మాట్లాడారు. స్థలం కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సంఘం సభ్యులు పెద్ది రమణ, పెద్ది కిషోర్, కృపారావు, వి.శ్రీను, పి.గోపి, అప్పన్న పాల్గొన్నారు.